క్లుప్తంగా

గొర్రెల పోషణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న పశువైద్యుడు

గుంతకల్లు రూరల్: స్థానిక ప్రభుత్వ పశువైద్యశాలలో గొర్రెల పెంపకం, యాజమాన్య పద్ధతులపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. గొర్రెల పోషణ, యాజమాన్య పద్ధతులపై గొర్రెల పెంపకం దారులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని గుంతకల్లు ప్రభుత్వ పశువైద్యశాల ఏడీ డాక్టర్ బీ.వెంకటేశ్వర్లు నాయక్ సూచించారు. విత్తనం పొట్టేలును రక్తసంబంధం లేని వేరే మంద నుంచి తీసుకోవాలన్నారు.పశువైద్యులు డాక్టర్ మహేష్, డాక్టర్ రంగస్వామి, డాక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శాంతిరామ్ కుటుంబానికి ఆర్థిసాయం



చెక్కు అందిస్తున్న యూనియన్ నాయకులు

గుంతకల్లు: స్థానిక డీజిల్ షెడ్ ఉద్యోగి శాంతిరామ్ కుటుంబానికి దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు అండగా నిలిచారు. అదివారం ప్రమాదవశాత్తు రైలింజన్ ఫ్యాన్ రెక్కల్లో శాంతిరామ్ చిక్కుకొని మృతి చెందిన విషయం తెలిసిందే. మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, డీజల్ షెడ్ బ్రాంచ్ కార్యదర్శి రమణ, డివిజనల్ సహాయ కార్యదర్శి మహ్మమద్‌గౌస్, కోశాధికారి శ్రీనివాసశర్మ, రిటైర్డ్ సహాయ కార్యదర్శి మాస్తాన్‌వలి బుధవారం శాంతిరామ్ ఇంటికి వెళ్లి ఆయన భార్య కల్పనబాయిని పరామర్శించారు. అనంతరం రూ.2లక్షల చెక్కును అందజేశారు.

రాయల్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ



స్థలపత్రాలు ఇస్తున్న కాసా చంద్రమోహన్

యాడికి: మండల కేంద్రంలో బుధవారం బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రాయల్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బొంబాయి రమేష్‌నాయుడు మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున దాదాపు రూ.50 లక్షల విలువ చేసే 30 సెంట్ల స్థలాన్ని యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ తన భార్య కాసా సుశీలమ్మ జ్ఞాపకార్థం విరాళంగా ఇచ్చారన్నారు. కాసా చంద్రమోహన్ ఆ స్థలానికి సంబంధించిన ధ్రువ పత్రాలను బలిజ సంఘం అధ్యక్షుడు హరినాథ్‌బాబుకు అందజేశారు. దాసరి శ్రీనివాస్, గిరి, కంబగిరి, రామాంజి, రాయుడు, తదితర బలిజ సోదరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు : కండ్లగూడూరుకు చెందిన ఓబయ్య అనే యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. ఓబయ్య కలహాల నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పురుగుల మందు తాగినట్లు తెలిసింది. గమనించిన స్థానికులు అతడిని అనంతపురం తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

పుట్లూరు సీఐగా సుబ్రహ్మణ్యం

పుట్లూరు: స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐగా ఆర్.జి.సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు నుంచి ఈయనను బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న వేణుగోపాల్‌ను వీఆర్‌కు పంపారు. మండల పరిస్థితులపై ఆయన సిబ్బందితో ఆరా తీశారు.

సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటనారాయణ

గార్లదిన్నె: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ వెంకటనారాయణ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఎంపీటీసీ సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. గార్లదిన్నె, ఇల్లూరు, పెనకచెర్ల డ్యాంలో ఫిష్ ఆంధ్రా ఔట్‌లెట్లు ఏర్పాటు చేసినట్లు మండల స్పెషల్ ఆఫీసర్ శాంతి తెలిపారు. మండలంలో 400 మంది విద్యార్థులు బడిబయట ఉన్నారని, వారిని బడిలో చేర్పించాలని ఎంపీడీఓ తేజోత్స్న కోరారు. వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ బాబా యునీస్, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, ఎంఈఓ వెంకటరమణనాయక్ ఉన్నారు.

ప్రజా సంక్షేమ యాత్రకు అపూర్వ ఆదరణ

యాడికి: తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ పాద యాత్రకు గ్రామగ్రామాన అపూర్వ ఆదరణ లభించింది. బుధవారం ఉదయం 7 గంటలకు మండలం లోని చింతలాయపల్లె నుంచి ప్రజా సంక్షేమయాత్ర ప్రారంభమైంది. మహిళలు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరిస్తూ పూల మాలలు వేసి గుమ్మడి కాయతో దిష్టి తీయశారు. ఎమ్మెల్యే గ్రామంలో అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ ముందుకు సాగారు. అనంతరం యాత్ర బోయరెడ్డి పల్లెకు చేరుకుంది. గ్రామానికి చేరుకోగానే మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యేకు హారతి ఇచ్చి పూల వర్షం కురిపించారు. ఉదయం 9 గంటల సమయంలో చిక్కేపల్లెకు బయలు దేరారు. మార్గ మధ్యలో పత్తిలో అరక పొస్తున్న రైతుతో మాట్లాడారు. రైతు అభీష్టం మేరకు ఎమ్మెల్యే ఎద్దులతో అరక తోలాడు. చిక్కేపల్లెలో సర్పంచు నాగలక్షుమ్మతో కలిసి బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి పేదవాడి గడపకూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను అందిస్తూ సీఎం వైఎస్ జగన్ ప్రజల చెంతకే పాలనను తీసుకొచ్చారన్నారు. అనంతరం చిక్కేపల్లె నుంచి పొలాలదారి గుండా యాత్ర సాగింది. అక్కడ వ్యవసాయ కూలీలు ప్రతి పథకం మా ఇళ్ల వద్దకు వస్తున్నాయని ఎమ్మెల్యే ఎదుట ఆనందం వ్యక్తం చేశారు.





బోయరెడ్డిపల్లెలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై పూలవర్షం కురిపిస్తున్న ప్రజలు, టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

మధ్యాహ్నం ఎమ్మెల్యే నిట్టూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించడంతో పలు వివరాలను హెచ్‌ంను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి పేరం స్వర్ణలతారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్లు హరినాథరెడ్డి, ఓబుళరెడ్డి, నాయకుడు కందిగోపుల మురళీ ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట రామిరెడ్డి, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నప్ప, నాయకులు మల్లికార్జున, శివరామిరెడ్డి, నాగిరెడ్డి, రామిరెడ్డి, వాసుదేవరెడ్డి, వెంకటరాముడు, మారుతీ,రామకృష్ణ, ఓబులేసు, అశోక్ రెడ్డి, నిట్టూరు రామాంజనేయరెడ్డి, జయక్రిష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ ఫరూక్, సీజీస్ మండల కన్వీనర్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సంక్షేమయాత్ర ఇలా

నిట్టూరు గ్రామంలో గురువారం ఉదయం ప్రజా సంక్షేమ పాదయాత్ర ప్రారంభం కానుంది. నిట్టూరు, తిరునాంపల్లె మీదుగా కొట్టాలపల్లె వరకు కొనసాగనుంది.

20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరిక

చింతలాయపల్లెకు చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచు కుమారులు పేరం బయపరెడ్డి, పేరం జగదీశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు లక్కు రఘునాథరెడ్డి, పేరం ఆది బయపరెడ్డి, గడ్డం కృష్ణ,ఆంజనేయులు, చక్కా రామాంజనే యులు, జక్కిరెడ్డి కొత్తరాయుడు,, జక్కిరెడ్డి కోటీశ్వర రెడ్డి, లక్కు వెంకటరామి రెడ్డి కుటుంబాలతో పాటు మరో 11 కుటుంబాల వారికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఎస్ఎస్ ట్యాంకుల్లోకి నీటి పంపింగ్ ప్రారంభం

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లోకి హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాల పంపింగ్ ప్రారంభమైంది. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కమిషనర్ మల్లికార్జున గంగాదేవికి పూజలు చేసి హారతులిచ్చారు. అనంతరం పంప్‌హౌస్ నందు మోటార్‌ల స్విచ్‌ను ఆన్ చేసి రెండు ట్యాంకుల్లోకి నీటి పంపింగ్‌ను షురూ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ రెండు ట్యాంకులు నిండటానికి 50 రోజుల సమయం పడుతుందన్నారు. పట్టణ ప్రజలకు తాగునీరు పుష్కలంగా ఉందని, రానున్న వేసవిలోనూ ఎలాంటి నీటి సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని కమిషనర్ చెప్పారు. కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, డీఈ రామ్మూర్తి, ఏఈ శ్రీకాంత్, శానిటరీ ఇన్స్‌పెక్టర్‌లు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, లైటింగ్ సెక్షన్ ఏఈ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఏకలవ్యుని స్ఫూర్తి భావితరాలకు అందించాలి

మహాభారతంలో గురుభక్తిని చాటే గొప్ప ఔన్నత్యం కలిగిన ఏకలవ్యుని స్ఫూర్తిని భావితరాలకు అందించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఎరుకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని 32వ వార్డులో ఏర్పాటు చేసిన ఏకలవ్యుడి విగ్రహాన్ని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు ఆవిష్కరించారు.



గంగ పూజ చేస్తున్న చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి

తదనంతరం కాలనీ ప్రవేశమార్గంలో నిర్మించిన ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకుంఠిత దీక్షతో విలువిద్యను అభ్యసించిన ఏకలవ్యుడు త్యాగానికి ప్రతీక అని, గురువు పట్ల ఆయనకున్న అంకితభావాన్ని చాటి చరిత్రలో నిలిచిపోయిన మహనీయుడని కొనియాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, కౌన్సిలర్ వై.సుధాకర్, ఎరుకుల సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రప్ప, వెంకటేశ్వర్లు, కోశాధికారి నరసింహులు, సంఘం పెద్దలు రామాంజనేయులు, ఆంజనేయులు, కిష్టప్ప, మల్లికార్జున, దానప్ప, భగవంతప్ప, సుంకన్న, అంజి, ఉమామహేశ్వరి, సాకే వీరాంజి, ఆనంద్, సుంకేశరావు, మల్లికార్జున, దేవేంద్ర పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



బూదేడులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే. జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గార్లదిన్నె: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం బూదేడు, సంజీవపురం, క్రిష్టాపురం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా తమ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే ఎదుట సంతోషం వ్యక్తం చేశారు.అలాగే సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తమ ఆశీస్సు లు ఎప్పుడూ ఉంటాయని దీవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామ న్నారు. ఇంటింటికి వెళ్లినప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను ప్రజలు మెచ్చుకుంటున్నారన్నారు. పార్టీతో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. నవరత్నాలతో ప్రతి ఇంటికీ ఆర్థిక భరోసానిస్తూ సీఎం పరిపాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ తేజోత్స్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, సర్పంచు శివాంజనేయులు, ఎంపీపీ వెంకటనా రాయణ, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీ నాయకులు రాజశేఖర్, తాతయ్య, పరశురాముడు, సంజీవులు, ప్రసాద్, రామకృష్ణ, శ్రీనివాసులు, రాము, వినోద్, యల్లప్ప పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట

బుక్కరాయసముద్రం: మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని ఆహార సలహా సంఘం చైర్‌పర్సన్, తహసీల్దార్ రమాదేవి, కో చైర్‌పర్సన్, ఎంపీపీ సునీత పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆహార సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్, డీటీ ప్రతాప్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ నాగభూషణ, సీఎస్ డీటీ శ్రీరాములు, తూనికలు, కొలతల శాఖ సీఐ శంకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆహార సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా గ్రామాల్లో ఎండీయూ వాహనాలు తిరగడం లేదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జెడ్పీటీసీ బాస్కర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, తాడిపత్రి జెడ్పీటీసీ కురుబ రమణమ్మ, ఏవీ రంగారావు పాల్గొన్నారు.



యల్లనూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

యల్లనూరు: మండలంలో రేషన్‌కార్డుదారులకు రేషన్ పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తహసీల్దార్ సుమతి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆహార సలహా కమిటీ సమావేశం జరిగింది. ఎంపీపీ గంగాదేవి, జెడ్పీటీసీ భోగతి విజయ ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ సరఫరాపై చర్చించారు. మండల కేంద్రంలో యండియూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ ఆలస్యమవుతోందని డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశ్వర్థరెడ్డి తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు.

ఆలయ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

పెద్దపప్పూరు: ఆలయ నిర్మాణ పనులు త్వరిగతిన పూర్తి చేయాలని దేవదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన వరదాయపల్లిలో రూ.56 లక్షలతో నిర్మిస్తున్న కాశీవిశ్వేశ్వర, ఆత్మారాయస్వామి, చిన్నపప్పూరు వద్ద 1.25 కోట్లతో నిర్మిస్తున్న పప్పూరమ్మ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అశ్వర్థనారాయణ స్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వాములను దర్శించుకున్నారు. జిల్లా దేవదాయశాఖ అధికారి ఆదిశేష నాయుడు, ఈఓ సుబ్రహ్మణ్యం, అర్చకులు బాలసుబ్రహ్మణ్యశర్మ, సుధీర్‌కుమార్ శర్మ ఉన్నారు.

తాడిపత్రి: చిన్నపొలమడ, వెలమకూరు గ్రామాల్లో చెన్నకేశవస్వామి దేవాలయం, ఆంజనేయస్వామి, ఈశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులను రాష్ట్ర దేవదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, జిల్లా దేవదాయ శాఖాధికారి కె.ఆదిశేషనాయుడు బుధవారం పరిశీలించారు. ఆలూరుకోన శ్రీరంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గోసు రామచంద్రారెడ్డి వీరికి స్వాగతం పలికారు.



వివరాలు తెలుసుకుంటున్న శ్రీకాంత్

అనాథకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న 60 యేళ్ల వృద్ధుడు అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల విజ్ఞప్తి మేరకు బుధవారం అనాథ మృతదేహానికి ఆ నలుగురు సేవాసమితి సభ్యులు పాతగుంతకల్లులోని హిందూ శ్మశానవాటికకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు. సమితి ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి సంపత్‌ఆచారి, సభ్యులు అంజి, అశోక్, ఆటోవేణు, కృష్ణమూర్తి, రాజశేఖర్‌ను పోలీసులు అభినందించారు.

కోతుల తరలింపు



కోతులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గుత్తి రూరల్: బసినేపల్లిలో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కోతులను వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుభాష్ రెడ్డి తమ సొంత ఖర్చుతో బుధవారం తరలించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తిమ్మారెడ్డి రూ.70 వేలు వెచ్చించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను గ్రామస్తులు అభినందించారు. నాయకులు రమేష్, మస్తాన్‌వలి, బోయలక్ష్మినారాయణ, వి.రామంజి, సుధాకర్, తిరుపతయ్య, రామంజి పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

యాడికి: మండల కేంద్రంలోని నం:1 సచివాలయం ఆవరణలో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నంద్యాల జిల్లాకు చెందిన శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు ఆది, రామ్మూర్తి, ప్రకాష్ 200 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 80 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు.

మెరుగైన సేవలందించండి

బుక్కరాయసముద్రం: ప్రజలకు మంచి మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. బుధవారం అమ్మవారి పేటలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డును పరిశీలించి సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి వైద్య పరీక్షలు చేస్తున్నారని ఆరా తీశారు. మందులు సక్రమంగా అందిస్తున్నారా లేదా అని ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ శ్రీహర ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

బుక్కరాయసముద్రం: జగనన్నకాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి శ్రీదేవి లబ్ధిదారులకు సూచించారు. బుధవారం సిద్ధరాంపురం జగనన్నకాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ మాట్లాడుతూ ఇళ్లు పూర్తి చేసిన లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలన్నారు. ఎంపీడీఓ విజయ భాస్కర్, డీఈ శ్రీమన్నారాయణ, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఈఓఆర్‌డీ దామోదరమ్మ పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న హర్ష

తాడిపత్రి: పట్టణంలోని హరిజనవాడలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పశు పెంపకం లాభదాయకం

బుక్కరాయసముద్రం: పశు పెంపకం లాభదాయకంగా ఉంటుందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. బుధవారం కేవీకేలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. పశు శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, రైతులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 సక్సెస్‌పై సంబరాలు

పామిడి: చంద్రయాన్-3 విజయవంతం కావడంతో పట్టణంలో బుధవారం సరస్వతీ ఉన్నత విద్యామందిరం విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక బీసీసీరోడ్డుపై విద్యార్థులు జాతీయజెండాను చేతబూని విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పటాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

గుంతకల్లు: చంద్రయాన్-3 విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సక్సెస్ హైస్కూల్ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్‌నగర్‌లోని పాఠశాల నుంచి ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ సాగింది. విద్యార్థులు విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లు సరైన సమయానికి స్పందించి చంద్రునిపై కాలు మోపాలని నినదించారు. సాయంత్రం చంద్రయాన్-3 ప్రత్యక్ష ప్రసారాన్ని స్కూల్ ఆవరణలో ప్రదర్శించినట్లు ప్రిన్సిపాల్ ఏసీ కేశవులు తెలిపారు.

గుత్తి: చంద్రయాన్-3 విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ గుత్తిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు,ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, సభ్యులు పాల్గొన్నారు.



పామిడిలో సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు

సరికొత్త అధ్యాయం



అంతరిక్ష చరిత్రలో ఇస్రో సరికొత్త అధ్యాయం ప్రారంభించింది. చంద్రయాన్-3తో జాబిల్లిపై ఎవరూ వెళ్లని దారుల్లో వెళ్లి..ఎవరూ చూడని దక్షిణ జాడల్ని ప్రపంచానికి చూపించింది. 140 కోట్ల మంది భారతీయుల కలల్ని నిజం చేస్తూ జాబిల్లిపై అడుగుపెట్టి భారత్ సరికొత్త చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించింది. ఇస్రో శాస్త్రవేత్తల పట్టుదల, కఠోరశ్రమతోనే అద్భుతమైన విజయం భారత్ సొంతమైంది. భారత వైజ్ఞానిక సత్తాను చాటి చెప్పిన ఇస్రో శాస్త్రవేత్తలకు సెల్యూట్.

– గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు



ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారతదేశం నిలవడం చాలా సంతోషంగా ఉంది. ఇస్రో మరిన్ని ప్రయోగాలు చేసి మన దేశం పేరును ప్రపంచ స్థాయిలో నిలపాలి.

–శ్రావణి, శింగనమల

గర్వించదగ్గ విషయం



చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ అడుగిడటంతో చరిత్ర పుటల్లో భారత్ నిలిచింది. 40 రోజులు ప్రయాణం చేసి అంతరిక్ష చరిత్రలో ఇస్రో సరికొత్త రికార్డు సృష్టించింది. ఇది భారతీయులు గర్వించ దగ్గ విషయం.

– కొండయాదవ్ ,కల్లూరు

ఖగోళ చరిత్రలోనే రికార్డ్



చంద్రయాన్-3 చంద్రుడిపై సాఫ్ట్‌గా ల్యాండ్ కావడం మరిచిపోలేని ఘటన. ఖగోళ చరిత్రలో రికార్డు. జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా నిలవడం ప్రతి భారతీయుడూ గర్వించదగ్గ విషయం. శాస్త్రవేత్తలకు అభినందనలు

– డాక్టర్ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్, ఎస్‌కేపీ డిగ్రీ కళాశాల, గుంతకల్లు

సంక్షిప్త సమాచారం

వేరుశనగ వామి దగ్ధం

పామిడి: ఎదురూరు గ్రామంలో రైతు పుల్లయ్యకు చెందిన వేరుశనగ వామి బుధవారం అగ్నికి ఆహుతైంది. వివరాలు.. గ్రామ వెలుపల దొడ్డిలో నెలరోజుల క్రితం పుల్లయ్య వేరుశనగపొట్టు వామి వేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో వామి కాలిబూడిదైంది. ఘటనలో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

యువకుడి దుర్మరణం

పెద్దవడుగూరు: లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... క్రిష్టిపాడుకు చెందిన ఎరికల తిప్పయ్య (35) బుధవారం ఉదయం గుత్తి నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అప్పేచర్ల సమీపంలోకి చేరుకోగానే 63వ జాతీయ రహదారిపై ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన సిమెంట్ లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన తిప్పయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

గేట్స్‌లో పాలిటెక్నిక్ కాలేజీ ప్రారంభం

గుత్తి: గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ రిబ్బన్ కత్తిరించి పాలిటెక్నిక్ కాలేజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో పాలిటెక్నిక్ కాలేజీని ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపాల్ సురయా, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దవడుగూరు: కిష్టపాడు గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి(25) అనే యువకుడు అనంతపురంలో బుధవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు..ఈశ్వర్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం కుటుంబ సమస్యలతో గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేశారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: రజాపురం శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన జితేంద్రబాబు, బన్నీ గాయపడ్డారు. గుంతకల్లులో జరిగే బంధువుల వివాహానికి బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు.

మిద్దె పైనుంచి పడి వెల్డర్ మృతి

తాడిపత్రి: నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి పైభాగం నుంచి ప్రమాదవశాత్తు కిందపడి వెల్డర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రికి చెందిన కుళ్లాయిస్వామి (33) స్థానిక శ్రీరాములపేటలో నిర్మాణంలో ఉన్న ఇంటి పైభాగంలో బుధవారం ఉదయం వెల్డింగ్ పనులు చేస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ హమీద్‌ఖాన్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వీఆర్ఏ అదృశ్యంపై కేసు నమోదు

యాడికి: ఈ నెల 20న రాత్రి విధులకు హాజరయ్యేందుకు వెళ్లిన కుందనకోటకు చెందిన వీఆర్ఏ తలారి రామశేషుడు అదృశ్యమయ్యాడు. బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. రామశేషుడి భార్య లక్ష్మిదేవి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి వీఆర్ఏ ఇంటికి చేరుకున్నట్లు సమాచారం.